

పాఠశాలల్లో ఆర్‌జెడి తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసకుంటామని ఆర్‌జేడీ విజయభాస్కర్ హెచ్చరించారు. మండలంలోని తూటంగి ప్రాథమికోన్నత, కస్తుర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావుతో కలిసి పర్యవేక్షించారు.. ఆయా పాఠశాలల్లో చిన్నారులకు అందుతున్న విద్య ప్రగతితోపాటు మండల విద్యాశాఖ కార్యాలయం, పాఠశాలల్లో విద్యుత్తు సౌకర్యం, హాజరు శాతంపై క్షుణంగా పరిశీలించారు. సమయపాలనతోనే విద్యాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. డిప్యూటీ విద్యాశాఖ అధికారి చెల్లయ్య, మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, సీఆర్టీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఆర్‌జెడి



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, వేదికపై రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు

ఆగస్టు 9 నాటికి ఆదివాసీలకు

శతశాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ఆదివాసీలకు ఆగస్టు 9 నాటికి 100శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రంలోని సిపిఎం అల్లూరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివాసి గిరిజన సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్చుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం మాట్లాడారు. జిఓ 3కు ప్రత్యామ్నాయంగా జిఓ తీసుకొచ్చిన 100శాతం గిరిజర్వేషన్ అమలు చేయాలని, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారన్నారు. రకరకాల సర్వేల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజ్ కమిటీ ఏర్పాటుకు కాల యాపన చేస్తుదన్నారు.కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో 100శాతం ఉద్యోగ అవకాశాల కోసం కనీసం పట్టించుకున్న దాఖలు లేవన్నారు. మెగా డిఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయింపు ఇచ్చి గిరిజన స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పాడేరు మెడికల్ కళాశాలకు నిధులు కేటాయించి, వంద శాతం సీట్లు భర్తీ చేసి, పూర్తిస్థాయిలో సిబ్బందిని కూడా నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా మారుమూల గిరిజన గ్రామాల్లో విష జ్వరాలతో గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై వైద్య సిబ్బంది స్పందించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దారి మళ్ళించడంతో గ్రామాల్లో డ్రైనేజీ, సిసి, రోడ్డు, తాగునీరు పారిశుధ్యం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. గతంలో కూడా వైసీపి ప్రభుత్వం పంచాయతీ నిధులు దారి మళ్ళించ డంతో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. గిరిజన ప్రాంతంలో స్మార్ట్ మీటర్లు పేరుతో కొత్తగా నిర్మించుకున్న గృహాలకు కేటగిరి 2 కింద నేరుగా బిగిస్తున్నారన్నారని తెలిపారు. దీంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి అప్పలనరస్స, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, అనంతగిరి జడ్పీటీసీ ధీసరి గంగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ పడాల్, ఎస్బి పోతురాజు, కె.త్రినాధ్, జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు, హైమావతి, వి.జయ, కె మోస్య, బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

660 కిలోల గంజాయి పట్టివేత

పాడేరు డిఎస్‌పి షేక్ షహబాజ్ అహమ్మద్

ప్రజాశక్తి పాడేరు టౌన్: గంజాయి నిర్మూలనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని పాడేరు డిఎస్పి షేక్ షహబాజ్ అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని వేర్వేరు ప్రాంతాల్లో రవాణా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారని పాడేరు డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి బుధవారం వివరాలు వెల్లడించారు. పెదబయలు మండలం పెదబయలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో పోలీసుల వాహన తనిఖీల్లో రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న 560 కిలోల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారన్నారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసు కోగా, ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.28 లక్షలు ఉంటుందన్నారు. అలాగే జి.మాడుగుల దగ్గర వాహనాల తనిఖీలలో మారుతి స్విఫ్ట్ వైట్ కార్ లో అక్రమంగా తరలిస్తున్న రూ.1లక్ష 50వేల విలువైన 30 కేజీల ఎండు గంజాయిని పట్టుకుని ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపించినట్లు తెలిపారు. ఒకరు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. మరో ఘటనలో ముంచింగిపుట్టు మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 3లక్షల 50వేల విలువైన 70 కిలోల గంజాయిని పట్టుకున్నారన్నారు. ఇద్దరి నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి నిందితుల వద్ద నుంచి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో జి.మాడుగుల సిఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి

హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా

నేడు బహిరంగ సభలు

-హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

-పెదకోట, చింతలపూడి పరిసర ప్రాంతాల్లో ప్రచారం

ప్రజాశక్తి - అనంతగిరి,దేవరాపల్లి:ఆదివాసీలకు, రైతులకు, ప్రజలకు నష్టం చేకూర్చే అదాని, నవయుగ హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఉద్యమం ఉధృత రూపం దాలుస్తోంది. ప్రాజెక్టుల ప్రతిపాదన వచ్చినప్పటి నుంచి అనేక రూపాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టిన ప్రజానీకం పెద్ద పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గురువారం ఉదయం 10 గంటలకు అల్లూరి జిల్లా పెదకోట పంచాయతీ రేగులపాలెంలోనూ, మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడిలోనూ భారీ బహిరంగ సభలు జరుగనున్నాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అల్లూరి, అనకాపల్లి, విజయనగరం జిల్లాల కార్యదర్శులు పి.అప్పలనర్స, జి.కోటేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణ, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారు. గిరిజన, ప్రజా సంఘాల నేతలు, సర్పంచులు, ఎంపిటిసిలు, పీసా కమిటీ ఛైర్మన్లు ఈ సభల్లో పాల్గొనున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఎం, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

గురువారం జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గిరిజనులతో కలిసి పెదకోట, టముటు, రేగులపాలెం, కొండిభకోట, పినకోట ప్రాంతాల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెదకోట (రేగులపాలెం) ప్రాంతంలో రైవాడ, గోస్తనీ జలాలపై 1800 మెగావాట్ల సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణమైతే పెదకోట పంచాయతీలో ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయని తెలిపారు. పినకోట పంచాయతీ పరిధిలోని గ్రామాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. దేవరాపల్లి మండలం చింతలపూడి, మారిక వద్ద శారదా నదిపై 900 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టు కడితే పరిసర ప్రాంతాల వారికి, రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. పై ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల రైవాడ ఆయకట్టు భూములు మొత్తం బీడు బారిపోతాయాని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ నగరానికి తాగునీటి సమస్య తలెత్తుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైవాడ ఆయకట్టు రైతులు, గిరిజనులు చేస్తున్న పోరాటంలో చేతులు కలపాలని కోరారు. గురువారం జరిగే బహిరంగ సభలకు గిరిపుత్రులు, రైతులు, నీటి సంఘాల ఛైర్మన్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జన్ని ఈశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

న్యాయం చేయకుంటే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి- కూనవరం: కూనవరం మండలం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు భూమి నష్టపరిహారం తీసుకుని స్థానికంగా లేనటువంటి గిరిజన నేతరుల భూములను భూమిలేని ఆదివాసి గిరిజనులకు పంచి ఇవ్వాలని స్థానిక రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించామని గిరిజన సంఘం నాయకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పోలవరం ప్రాజెక్టు నష్టపరిహారం తీసుకున్న గిరిజనేతరులు భూమిని ప్రభుత్వం తీసుకుంది కాబట్టి స్థానికంగా లేనందున అట్టి భూమిని పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదాకా భూమిలేని ఆదివాసీ గిరిజనులకు పంపిణీ చేయాలని అలా పంచని పక్షంలో ఆదివాసీ గిరిజన సంఘం ఉద్యమిస్తుందని ఉద్యమానికి ఆదివాసీ గిరిజనులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం ప్రజా ప్రతినిధులు బొగ్గ రామారావు, సోడే శంకర్, బోగ్గ వెంకమ్మ, ఎంపిటిసి ధర్మల అమ్మాజీ, సంఘం నాయకులు బాబు బోర్రయ, పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న గిరిజనసంఘం, రైతుకూలి సంఘం నాయకులు

ప్రజాశక్తి - గంగవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసిన వేతనదారులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం, రైతుకూలి సంఘం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో వైజంక్షన్‌లో ఎర్రజెండాలతో మానవహారం నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు వేట్ల విజయ, రైతుకూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ పనిచేసి వంద రోజులు పూర్తయినప్పటికీ చాలామందికి ఉపాధి వేతనాలు చెల్లించలేదని వాపోయారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ పనులను రెండు వందల రోజులకు పెంచాలని, రోజు కూలి వేతనం రూ.600కు పెంచాలని, దానికి తగిన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలను సరిచేయాలని డిమాండ్ చేశారు. మొన్న రాజామంగి నిన్న గంగవరం జగ్గంపాలెం పంచాయతీల్లో తొమ్మిది లక్షలు అవినీతి జరిగిందన్నారు. ప్రతి మండలంలో అదేవిధంగా అవినీతి జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కొత్తగంగవరం నుండి పాత గంగవరం, ఎంపిడిఓ కార్యాలయం వరకూ నినాదాలతో ప్రదర్శన చేశారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓకు అందించారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలి సంఘం నాయకులు, కార్యకర్తలు వేట్లా సత్యనారాయణ, తాటి బుల్లబ్బాయ్, శ్రీరాములు, పీసా కమిటి కార్యదర్శి రామిరెడ్డి తదితరులు నాయకత్వం వహించారు.

ముంపు భూములకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కూటూరు గ్రామంలో పోలవరం ప్రాజెక్టు ముంపు భూముల గిరిజనులు సమావేశం నిర్వహించారు. పాయం భద్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేయాలని చెబుతోందని కాని ముంపులో ఉన్న భూములకు నష్టపరిహారం చెల్లించాలనే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. గతంలో ఇదే టిడిపి ప్రభుత్వం 2016లో భూసేకరణ పేరుతో నోటిఫికేషన్ ఇచ్చి తర్వాత మర్చిపోయారన్నారు. అదేవిధంగా ఇప్పుడు వ్యవహరిస్తే నిర్వాసిత గిరిజనులందరూ ఏకమై ప్రాజెక్ట్ దగ్గరకు వెళ్ళి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూపరాజు, పాయం శేఖర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సీతారామయ్య

26న మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల ప్రజాపరిషత్ సర్వసభ సమావేశం 26న ఉదయం 10.30 నిమిషాలకు ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో అధ్యక్షులు బందం శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపిడిఓ విశ్వనాథ్ తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండలస్తాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులు శాఖపరమైన ప్రగతి నివేదికలు 2 ప్రతులు 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఎంపిడిఓ కార్యాలయం పరిపాలన అధికారికి అందజేయాలన్నారు. సర్వసభ్య సమావేశానికి సంబంధిత అధికారులు మాత్రమే హాజరుకావాలన్నారు.



మాట్లాడుతున్న కానిస్టేబుల్ రాజమణి

శక్తి యాప్‌ను వినియోగించండి

ప్రజాశక్తి - చింతూరు : శక్తి యాప్‌ను ఉపయోగించుని ఆపదల నుండి గట్టెక్కాలని కానిస్టేబుల్ రాజమణి పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాల పట్ల జాగ్రత్తగా మెలగాలని సూచించారు. స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో బుధవారం సిఐ తెల్లం దుర్గాప్రసాద్, ఎస్సై రమేష్ ఆదేశాల మేరకు, పోలీస్ సిబ్బంది 'ఓ యువత మేలుకో జీవితాన్ని నిలుపుకో' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో మాట్లాడుతూ యువత నైతిక విలువలు పాటించి మంచి జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి సమాజానికి కళాశాలకు తల్లిదండ్రులకు ఆదర్శంగా మెలగాలని కోరారు. కానిస్టేబుల్ చంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌ను మంచి విషయాలు తెలుసుకోవడం కోసమే వినియోగించుకోవాలని కోరారు. మత్తుపదార్థాల జోలికి వెళ్ళరాదని సూచించారు. తెలుగు అధ్యాపకులు సుశీల, దాసరి శ్రీనివాసరావు, గణేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన మండల అధ్యక్షుడు సాయికృష్ణ

సీజనల్ వ్యాధులు సోకకుండా చూడాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలం కేంద్రంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని మండల జనసేన అధ్యక్షులు మూలకాల సాయికృష్ణ బుధవారం సందర్శించారు. డాక్టర్ అనిల్‌కుమార్ వైద్యసిబ్బందితో మాట్లాడుతూ సీజనల్‌లో వచ్చే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి సంబంధిత మందులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. దోమలమందు పిచికారి చేయించాలని, దోమతెరలు కూడా అందించాలని, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. కార్యకర్తలు అంజనరావు, ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేందుకు కృషి



ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం: మండలంలోని భీరంపల్లి పంచాయితీ ఉసిరిజొన్నల గ్రామంలో బుధివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని, రోడ్లు, డ్రైనేజీ, నూతనగృహాల మంజూరుకు ప్రజలు అందించిన వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. త్వరలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కానున్నాయని, ప్రజలంతా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రంపచోడవరం టిడిపి మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, సీనియర్ నాయకులు మందేశ్వర రావు, రాజేంద్రవరప్రసాద్, సింహాచలం, సిద్ధా వెంకన్న పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డిపిఓ చంద్రశేఖర్.

ప్రజాశక్తి-జికె వీధి : మండలంలోని వంచుల, రింతడ పంచాయతీల్లో జిల్లా పంచాయతీ అధికారి కె.పి చంద్రశేఖర్ పర్యటించారు. సచివాలయం సిబ్బందికి ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, నీటి సరఫరా, చెత్త తో సంపద తయారీ కేంద్రాలు,వీధి దీపాలు నిర్వహణ పై తగు సూచనలు అవగాహన కల్పించారు. తడి పొడి చెత్త పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని పంచాయతీ సెక్రెటరీలను ఆయన సూచించారు. తడి పొడి చెత్తను డస్ట్ బిన్ లో వేయాలని ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, కాటన్ బ్యాగులను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మితే షాపులు సీజ్ చేయడం జరుగుతుందని దుకాణ దారులకు ఆయన హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్టు పంచాయతీ సెక్రెటరీలు చూసుకోవాలని ఆయన తెలిపారు.క్లాప్ మిత్రులకు జీతాలు సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేష్, పంచాయతీ సర్పంచ్ బొర్నెలి లక్ష్మి, వనచల కాసులమ్మ, రింతాడ పంచాయతీ సెక్రెటరీ అరుణ్ కుమార్, వంచల పంచాయతీ సెక్రెటరీ శివ, సచివాలయ సిబ్బంది, ప్రజలు, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘన సత్కారం


సన్మానిస్తున్న ఉద్యోగులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-చింతపల్లి: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని తమ్మెంగుల పంచాయతీ సర్పంచ్ సలిమిలి లక్ష్మయ్య జనసేన పార్టీ మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు పిలుపునిచ్చారు. బుధవారం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగుల వీడ్కోలు సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఉద్యోగులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను బడుగు, బలహీన వర్గాలకు సమర్థవంతంగా అందించేందుకు ముందుండాలని సూచించారు. ప్రజల అభివృద్ధిలో సచివాలయ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు సింధరి మల్లేశ్వరావు, బూత్ కమిటీ ఇంచార్జి వంతల భీమన్న, జనసేన నాయకుడు మర్రి మనోహర్, డిజిటల్ అసిస్టెంట్ పాంగి శ్రీను, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గిడ్డి రాజకుమారును పంచాయతీల సర్పంచులు, వైసీపీ, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి భూతగాదాలు, రెవెన్యూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు.

కనెక్టెడ్ టీవీల పాత్రపై అధ్యయనం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సామ్‌సంగ్ యాడ్స్, కాంతార్‌తో కలిసి కనెక్టెడ్ టీవీల పాత్రపై అధ్యయనం చేస్తున్నట్లు సామ్ సంగ్ యాడ్స్ క్యూలెంట్ సొల్యూషన్స్ హెడ్ భావనా సైన్గర్ తెలిపారు. దాబాగార్డెన్స్‌లోని సామ్ సంగ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది కీలకమైన బ్రాండ్ కెపిటలను నడిపించడంలో కనెక్టెడ్ టీవీ (సిటివి) ప్రకటనల ప్రభావవంతమైన పాత్రను స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మిడ్ టు లోయర్ ఫన్నెల్ మెట్రిక్‌లపై బలమైన, డేటా ఆధారిత ఇన్ సైట్స్‌ను అందించడానికి చేసిన అధ్యయనం అని తెలిపారు.

గ్రహణం మొర్రిపై అవగాహన

-డాక్టర్ ముకుందరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గ్రహణం మొర్రిపై ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్లాస్టిక్ సర్జన్, స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ముకుందరెడ్డి తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మైల్ ట్రైన్ ఆసియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రీజనల్ డైరెక్టర్ మమతా కారల్ మాట్లాడుతూ, స్మైల్ ట్రైన్ ఇండియా గుడ్ విల్ అంబాసిడర్గా సినీనటి పావని గంగిరెడ్డిని తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో గ్రహణం మొర్రిపై అవగాహన కల్పించేందుకు అంబాసిడర్గా నియమించినట్లు తెలిపారు. సినీ నటి పావని మాట్లాడుతూ, గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలతో మాట్లాడితే మనసు చలించిపోతుందన్నారు. గ్రహణం మొర్రి అంశంపై మరింత అవగాహన పెంచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

పాఠశాలను మరమ్మతు చేయాలి


వేడుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతగిరి: పాఠశాల మరమ్మతు పనులు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను వేడుకుంటూ బుధవారం చేతులు జోడించి వినూత్న రీతిలో మండలంలోని పినకోట స్కూల్ కాంప్లెక్స్ పంచాయతీ చింతపాకలో గిరిజన విద్యార్థులు, తల్లి దండ్రులు నిరసన చేపట్టారు. వర్షంపడితే కనీసం కూర్చోవడానికి అవకాశం లేదని, పాఠశాల పైకప్పు పూర్తిగా పెచ్చులు పడిపోతున్నాయని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతపాక గ్రామానికి చెందిన 23 మంది చదువుతున్నారని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి వెంటనే పాఠశాలకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో రజతం


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- పెందుర్తి : పంజాబ్ రాష్ట్రం, జలంధర్‌లో నిర్వహించిన జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖపట్నం పి.ఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం- 1 జట్టు రజత పతకాన్ని సాధించింది. కోచ్ శ్రావణి ఆధ్వర్యంలో చంద్రిక, సౌమ్య, సరిత, అరణ్య, శ్రీనిధి, కేసవి, బ్యూలా, శృతి, కీర్తన, లక్ష్మీ ప్రియ, లాస్య ప్రతిభ కనబరిచి విద్యార్థులతో కూడిన జట్టు పోటీల్లో రాణించి రన్నరప్‌గా నిలిచారు. విద్యార్థులను ఇండో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థినులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపల్ కిశోర్, కోచ్ శ్రావణిని అభినందించారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


హాస్టల్ తనిఖీలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వార్డెన్ ను ఆదేశించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల రవ్వలగూడ పాఠశాలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టాలని హాస్టల్ వార్డెన్ ను ఆదేశించారు. వంటగది స్థితిగతులను పరిశీలించి, అపరిశుభ్రంగా ఉండడంతో మందలించి పరిసరాలు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో జ్వరాల బారిన పడిన పలువురు విద్యార్థులు సిక్ రూమ్ లో కాకుండా, వారి వారి వసతి గదిలోనే విశ్రాంతిలో ఉండడంతో, హాస్టల్ వార్డెన్ ను మందలించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స అందించాలని వార్డెన్ ను ఆదేశించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అలసత్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. పాఠశాల రికార్డ్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఎస్ఐ-2 ఎం వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఐ-2 వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ర్యాగింగ్ చేస్తే ఎలాంటి మినహాయింపు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు గౌరవాన్ని, సమాజంలో గుర్తింపును అందించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాకు భాగస్వామ్యంగా ఉండి వ్యాపారం చేపడితే కేసులు పెడతామన్నారు. మైదాన ప్రాంతాల్లో గంజాయి వ్యాపారులు మాయమాటలతో ఆకర్షించే ప్రయత్నాలు చేస్తారని, వాటికి లోనవకుండా ఉండాలని సూచించారు. గంజాయి రవాణాలో పాల్పడి అనేకమంది గిరిజనులు, విద్యార్థులు జైలు పాలవడం జరిగిందని గుర్తు చేశారు.


మాట్లాడుతున్న ఎస్ఐ

విద్యార్థులు జైలు పాలైతే వారి కుటుంబాలు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయని, జీవితాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షులుగా మహాదేవ్, ఆనందరావు

ప్రజాశక్తి- అరకులోయ:తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా లోక్కోయి మహాదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పద్మాపురం పంచాయతీలోని ఓ ప్రైవేట్ రిసార్ట్స్‌లో మండల పార్టీ కార్యవర్గం ఎన్నికలు అరకు నియోజకవర్గం పరిశీలకుడు శివరామకృష్ణ, అరకు నియోజకవర్గ ఇన్చార్జి ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొరల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు, పద్మాపురం మాజీ సర్పంచ్ లోకోయి మహాదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, ప్రధాన కార్యదర్శిగా పాంగిరాజు, ఉపాధ్యక్షులుగా కూన రమేష్, కార్యదర్శులుగా ఎల్బీ భీమరాజు, శెట్టి రాజు, అభిమన్యు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కిల్లో నాగరాజు, పాంగిరాజు, జి మోహనరావు, కోశాధికారిగా అర్జున్‌లు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరి లక్ష్మి, తెలుగుదేశం సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ పెట్టేలి రాము, వెంకటరావు, శెట్టి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: టిడిపి మండల అధ్యక్షుడిగా కె ఆనందరావు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని కిడారి సామాజిక భవనంలో ఆ పార్టీ సంస్థాగత మండల ఎన్నికలను అరకు పార్లమెంటరీ పరిశీలకులు, అరకు


నూతన అధ్యక్షులతో నియోజకవర్గ పరిశీలకుడు శివ రామకృష్ణ.

నియోజకవర్గ పరిశీలకులు శివరామకృష్ణ, ఆర్టీసీ రిజియన్ చైర్మన్ దొన్నుదొర సమక్షంలో ఎన్నికలను నిర్వహించారు. గ్రామ కమిటి అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించగా ఆనందరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. పార్టీ పురోభివృద్ధికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులను సమన్వయం చేసుకుని పాటుపడాలన్నారు. మాజీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డులో చదువులు

రోజుకొకరి ఇంట్లో మధ్యాహ్న వంటలు తయారీ
శాశ్వత భవనం లేకపోవడంతో వండేందుకూ అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధులు గ్రామంలో శాశ్వతభవనం నిర్మించకపోవడంతో రేకులషెడ్‌లో విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యకు పెద్దపీట వేస్తున్నామని పదేపదే చెబుతున్న ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. తాత్కాలికంగా పాఠశాలలో రేకులషెడ్లు నిర్మించి అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు అనేకసార్లు ఈ విషయమై విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ భవననిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. మధ్యాహ్న భోజనం పథకానికి భవనం లేకపోవడంతో బంధువీధి గ్రామంలో ఎవరో ఒకరి


రేకులషెడ్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఇంట్లో వంటలు తయారుచేసి విద్యార్థులకు పెట్టాల్సి వస్తోంది. వర్షం కురిస్తే లోపలికి వర్షంనీరు వస్తోంది. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 50 మంది పైగా విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాలకు శాశ్వతభవనం, అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేందుకు కూడా భవనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

-కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి కావాలని నిర్దేశించారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పని చేయాలని, పురోగతి సాధించాలని సూచించారు. బుధవారం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో లేఅవుట్ వారీగా సమీక్షించారు. లక్ష్యాలపై దృష్టి సారించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇళ్ల నిర్మాణాల పనులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యసాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికి మూడు దఫాలు మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ పురోగతి లేకపోతే సస్పెండ్‌కు రిఫర్ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు.

ఇళ్లు కట్టకపోతే పట్టా రద్దు

ప్రస్తుతం లబ్ధిపొందిన వారికి మరొక పథకంలో ఇళ్లు కానీ, స్థలం కానీ రాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మంజూరైన ప్రతి ఒక్కరి చేతా ఇళ్లు కట్టించి తీరాల్సిందేనని అధికారులను ఆదేశించారు. అప్పటికీ ఇళ్లు కట్టడానికి ఆసక్తి చూపకపోతే సంబంధిత లబ్ధిదారుల పట్టాను, ఇల్లును రద్దు చేస్తామని స్పష్టంగా విడమరిచి చెప్పాలన్నారు. విద్యుత్, తాగునీరు,


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాపాయి సంతపాలెం, విజయపాలెం లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల వివరాలను తెలుపుతూ నివేదిక సమర్పించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పిడి సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డిఇలు, ఇలు, లేఅవుట్ ఇన్చార్జి అధికారులు పాల్గొన్నారు.

సమయానికి విధులకు హాజరు కావాలి

జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసి అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు కార్యాలయ పనివేళల సమయానికి తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు.

బుధవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని ప్రజా ఆరోగ్యవిభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాటిస్టికల్ ఆఫీసర్ పిడివి.ప్రసాదరావు చాంబర్‌లో జనన, మరణ వివరాలను, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ఎన్ని హాస్పిటల్స్ నమోదు కలిగి ఉన్నాయని ఆరా తీశారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు అడిగిన వారికి ఆలస్యం చేయకుండా సంబంధిత అర్జీల మేరకు వెను వెంటనే జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జివిఎంసి ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ

జివిఎంసి ఆదాయ పరిపుష్టికి అవసరమైన మార్గాలను అన్వేషించి కార్యచరణ చేపట్టాల్సిన బాధ్యత జివిఎంసి రెవెన్యూ అధికారులపై ఉందని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీరు, దుకాణాలు, వాణిజ్య, సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, హాస్పిటల్స్ మొదలైన పన్నులతోపాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పన్నులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వసూలు చేయాలన్నారు. అన్ని జోన్ల పరిధిలో ఆగస్టు 31వ నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

పాఠశాల భవనాన్ని నిర్మించాలి


మాట్లాడుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి -హుకుంపేట:మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలుర పాఠశాల-2లో భవనాలు లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత పదేళ్లుగా అద్దె భవనంలోనే ఈ పాఠశాల కొనసాగుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానికంగా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సమస్యలపై నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల భవనం, మరుగుదొడ్లు, వంటశాల వంటి మౌలిక సదుపాయాల కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైసీపీ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు హాజరయ్యారు. పాఠశాల కమిటీ చైర్మన్ రేగం ఈశ్వరమ్మ మాట్లాడుతూ, తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థి నుండి రూ.2000 వసూలు చేసినా పాఠశాల అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు గడిచినా పాఠశాలకు స్వంత భవనం లేకపోవడం బాధాకరమన్నారు. వైస్ ఎంపీపీ కొండలరావు మాట్లాడుతూ, వసతి లేకుండా విద్యాభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం 300 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ, జూనియర్ కళాశాల భవనంలోని నాలుగు ఇరుకైన గదుల్లోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. సర్వశిక్షా అభియాన్ నిధులతో నిర్మించాల్సిన రెండంతస్తుల భవనం గత ఐదేళ్లుగా నిర్మాణంలో నిలిచి పోయిందని విమర్శించారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్స్, వంటగది, వాచ్‌మన్ వంటి సదుపాయాల కల్పన అవసరమని అభిప్రాయపడ్డారు. ఒకే గదిలో తరగతులు నిర్వహిస్తూ, అదే గదిలో విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించక పోతే ఈ నెల 25న ఐటీడీఏ కార్యాలయం ముందు ముట్టడి చేపడతామని పేరెంట్స్ కమిటీ హెచ్చరించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కోటిబాబు, అశోక్, రాజారావు, మత్స్య రాజు, నాగబాబు, కొత్తన్న, ఈశ్వర్, వెంకట్, గంగమ్మ, అప్పలమ్మ, సత్యవతి, గంగభవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ ఘటనల ఆధారంగా
'రాజు గాని సవాల్' చిత్రం

ప్రజాశక్తి- సీతమ్మధార : లెలిజాల రవీంధర్, సంధ్య రాథోడ్, రితికా చక్రవర్తి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'రాజు గాని సవాల్" చిత్రం వచ్చేనెల 8న శ్రీలక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. బుధవారం ఉదయం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో హీరో దర్శక నిర్మాత లెలిజాల రవీంధర్, మాట్లాడుతూ తమ జీవితాల్లో జరిగిన రియల్ సంఘటలను ఆధారంగా చేసుకుని చిత్రాన్ని రూపొందించామని, చిత్రం సహజంగా ఉండేందుకు కవాడిగూడ రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశామన్నారు. మధ్య తరగతి ప్రజల జీవితంలో ఎన్నో సవాళ్లు ఉంటాయిని. అలాంటి సందర్భంలో ఒక పెద్ద సమస్య ఎదురైతే వారు ఎలా ఎదుర్కొంటారనే ఇతివృత్తంతో చిత్రం సాగుతుందన్నారు. కుటుంబ సంబంధాలు, స్నేహితుల మధ్య ఉండే అనుబంధాలను ఆకట్టుకునేలా తెరకెక్కించినట్టు తెలిపారు. హీరోయిన్ రితికా చక్రవర్తి మాట్లాడుతూ రాజు గాని సవాల్ మూవీని ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకుంటారన్నారు. ఈ చిత్రం కోసం తామంతా ఎంతో కష్టబడి పనిచేశామన్నారు. అందరం హ్యాపీగా ఫీలయ్యే రిజల్ట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లెలిజాల రవీంధర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రంలో మరో హీరోయిన్‌గా సంధ్య రాథోడ్, రవీంధర్, బొమ్మకంటి, తదితరులు నటిస్తున్నారు. 30 ఏళ్లుగా డిస్ట్రిబ్యూషన్ రంగంలో ఉన్న బాపిరాజు ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఎయిర్ పోర్టులో ప్రయాణికుల సౌకర్యార్థం యాక్ట్ ఫైబర్ నెట్ ఉచిత ఇంటర్నెట్ వైఫై సేవలను ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎన్.పురుషోత్తం బుధవారం ప్రారంభించారు. ఉచిత వైఫై సర్వీసు అందించేందుకు ముందుకొచ్చిన యాక్ట్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యాక్ట్ వైస్ ప్రెసిడెంట్ సచిన్ రోషన్‌లాల్ మాట్లాడుతూ ప్రతి ప్రయాణికుడూ మొబైల్ ఓటిపి ద్వారా కనెక్టు అయి గంట సమయం ఉచితంగా యాక్ట్ ఫైబర్ నెట్ వైఫై ఉచిత సేవలు పొందవచ్చన్నారు. ఎయిర్ పోర్టు ప్రాంగణంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏర్పాటు చేసిన ఫ్రీ వైఫై జోన్ ప్రారంభ కార్యక్రమంలో యాక్ట్ సీనియర్ మేనేజర్ ప్రసాదరెడ్డి, ఎయిర్ పోర్టు డిజిఎం ఆర్.భాస్కరరావు, ఐటి విభాగ సహాయక ఇంజినీర్ సిహెచ్‌వివి. గణేశ్వరరావు పాల్గొన్నారు.



పోర్టులో ట్రైనీ ఐపిఎస్ అధికారులు

పోర్టును సందర్శించిన ట్రెయినీ ఐపిఎస్‌లు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : వివిధ రాష్ట్రాలకు చెందిన 28 మంది ట్రెయినీ ఐపిఎస్ అధికారుల బృందం బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీని సందర్శించింది. సముద్ర భద్రతలో ఎదురయ్యే ఆధునిక సవాళ్ల గురించి అవగాహన పొందే ఉద్దేశంతో పోర్టును సందర్శించారు. సముద్ర భద్రతకు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, భారత ప్రభుత్వం శిక్షణలో ఉన్న అధికారులకు ఈ తరహా సందర్శనలను నిర్వహిస్తోంది. శిక్షణలో ఉన్న ఐపిఎస్ అధికారులకు పోర్టు అధికారులు సాదర స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, అభివృద్ధి పనులను గురించి పోర్టు అధికారులు వివరించారు.

సంపూర్ణ అక్షరాస్యతకు 'అక్షరాంధ్ర'

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి 'అక్షరాంధ్ర' ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. అక్షరాంధ్ర జిల్లా కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో 78 వేలా 676 మంది 15 నుండి 59 సంవత్సారాల వయసు గల వయోజనులను గుర్తించినట్లు తెలిపారు. వీరందరినీ మార్చి 2026లోగా అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యత జిల్లాగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పది మందికి ఒక వాలంటరీ టీచరును నియమించాలని, తరగతుల నిర్వహణకు గ్రామ, వార్డులలో అంగన్వాడి కేంద్రాలు, కమ్యూనిటి కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. తరగతులు ప్రతిరోజు సాయంత్రం వేళల్లో 5 నుంచి 7 గంటలలోపు నిర్వహించాలని తెలిపారు. 15 గంటలు ఆడియో విజువల్ ద్వారా, 40 గంటలు క్లాస్ రూము తరగతులు, 45 గంటలు అభ్యాసన కార్యక్రమాలు చేయాలన్నారు. అక్షరాస్యతా తరగతులకు హాజరై విద్యావంతులైన వారందరికీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా మార్చి నెలలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సుబ్రహ్మణ్యం వర్మ, సత్యవేణి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.